# గలగలా గోదారి

-భైరవయ్య

పేడతో అలికి ముగ్గులు పెట్టిన విశాలమైన అరుగుమీద, గోష్పాదమంత పిలక అగ్నిశిఖలా వెలుగుతూ వుండగా, ఫాలాటాన విభూతి రేఖల మధ్య కుంకుమ బొట్టు భాసిస్తూ వుండగా, షట్పంజలు పోసి కట్టిన పంచెతో బాసీపట్టు వేసుకుని, పతంజలిలా శోభిల్లుతూన్న అవధాని గారు, చుట్టూ పరివేష్టించి వున్న శిష్యులకి 'ఈశావాస్యోపనిషత్తు'ని వ్యాఖ్యానిస్తున్నారు.

వేదార్థం తెలిసిన మహా పండితుల్లో అబ్బాయ్ అవధాని గారంటే. ఉపనిషత్తుల సారాన్ని ఔపోశన పట్టినవారాయె. ఆ ఉపనిషత్తుల సారాన్ని పరిపూర్ణంగా ఒంట బట్టించుకున్న మహానుభావులు. మనసా వాచా కర్మణా కూడా ఆ విధంగానే జీవించిన కర్మిష్టి. వేద విహితంగా జీవిస్తూ, వేదమాత గాయత్రిని అణువణువునా అహర్నిశలూ వుపాశించిన వేదపురుషులు వాచ్యార్థాలు కాక వేదాల, ఉపనిషత్తుల అంతరార్థాన్ని ఆకళించుకున్న వ్యక్తి. ఆనాడు, ఆ పరగణాలో వేద సంబంధమైన సందేహమేదైనా తీర్చగలిగే వ్యక్తి ఆయనొక్కరేరా. సుమధురమైన గంభీర నాదంతో సుస్వరంగా ఆయన వేద పారాయణ చేస్తూవుంటే ప్రకృతి యావత్తూ పులకించి పోయేదిరా అబ్బాయ్. ఆ చోట వేదమాత తాండవం చేసేదిరా. నిర్ధూమంగా వెలిగే అగ్నిశిఖరా అబ్బాయ్ ఆయన ఎంతటి మహా మహుడైనా, ఆ విద్వత్ప్రభ ముందు అవన శిరస్కుడుత కావలసిందే. ఆయన దగ్గర శిష్యరికం చేసి, ఆ అపర వ్యాసుని సేవలో తరించి, ఆ వేదమాతని ప్రసన్నం చేసుకోవడానికి దూర దూరాల నుంచి వచ్చేవారాయె. ఆర్తితో వచ్చిన వ్యక్తికి విద్యాదానం చెయ్యడానికి అవధాని గారెప్పుడూ సంతతోత్సాహులే. ఆ వచ్చిన వ్యక్తి ఎవరా అన్నది ఆయనకి అప్రస్తుతం. ఆ వ్యక్తిలో తపన, తితీక్ష వున్నాయా, విద్యార్థత నిచ్చే వినయం వుందా అన్నదే ఆయన చూసేవారు. అవి వున్న వ్యక్తిని ఆదరించి, వాడు పుక్కిట పట్టగలిగినంత వరకు, ఆ అమృతాన్ని ధారగా పోసేవారు. అలా ఆ అమృతం తాగి తరించిన వ్యక్తులెందరో. అదొక ఉత్తుంగ జలధి. ఎంతమంది ఎన్ని దోసిళ్ళతో తాగితే మటుకు ఏమవుతుంది చెప్పు.

ఆ అవధానిగారా వుదయం పరివేష్టించి వున్న శిష్య గణానికి, వారి వాగామృతంలో తడిసి పునీతులవ్వాలని వచ్చివున్న జిజ్ఞాసువులకి 'ఈశావాస్యోపనిషత్తు'ని వివరిస్తున్నారు. ఒక్కొక్క పదం, దాని అర్థం, ఆ అర్థం వెనక వున్న విశేషం, ఆ విశేషం వెనక వున్న వేదాంత రహస్యం, అలా ఎత్తిపోతల జలపాతంలా అవిచ్ఛిన్నంగా. ఆ వ్యాఖ్యానం సాగుతోందిరా అబ్బాయ్.

శాంత గంభీరంగా ప్రవహించే అఖండ గౌతమిలా సాగుతున్న అవధాని గారి వ్యాఖ్యాన రసామృతంలో శ్రోతలు పునీతులవుతున్న సమయంలో, ఆ ప్రవాహానికి చిన్న ఆనకట్ట పడిందిరా అబ్బాయ్.

## "భూషలు గావు........"

అరుగుదగ్గర అయిన అలికిడికి, రసభంగమయిందన్న విరాకుతో శ్రోతలు చూస్తే, 'ఎవరాఆగంతకుడు' అన్నట్టు అవధానిగారు చూసారు. రఘురామరాజు గారి ముఖ్య ఆంతరంగీకుడు కనిపించాడు. అవధానిగారి దృష్టి తనపై బడిందని తెలియగానే, ఆతడు వారికి సవినయంగా నమస్కరించాడు. ప్రశ్నార్థకంగా కనుబొమలు పైకెత్తిన వారితో, "చిత్తవండి ప్రభువులు ఉపనిషత్సారాన్ని తమ ద్వారా తెలుసుకోవాలని కుతూహల పడుతున్నారు. తమరి సెలవైతే మేనా సిద్ధంగా వుంది" అని విన్నవించుకున్నాడు.

"ఆహా" అన్నారు అవధానిగారు. తిరిగి వారి వ్యాఖ్యానం వేగం పుంజుకుంది.

ఆ ఆంతరంగికుడు అలాగే నిలబడిపోయాడాయె అబ్బాయ్ కొంతసేపు. అవధాని గారి దృష్టి తిరిగి అటు మళ్ళలేదు. శ్రోతలు తమ చెవులు రెండూ అవధానిగారి కప్పగించి నా చూపులు మటుకు అటూ యిటూ ప్రసరించారు. అవధానిగారి నుంచి మరో మాట లేకపోవడంతో, వారికి తిరిగి నమస్కరించి వచ్చిన తోవనే వెళ్ళిపోయాడురా.

ఆ రోజు ఆ ఘట్టం ఆ విధంగా ముగిసింది.

ఆ విషయాన్ని తిరిగి ప్రస్తావించే సాహసం శిష్యులెవరూ చెయ్యలేదు. అవధానిగారూ స్పృశించలేదు. వేద పాఠాలు, ఉపనిషద్రహస్య వివరణలు యథావిధిగా సాగిపోతున్నాయి.

ఓ వుదయం మామూలుగానే అవధానిగారు సభ తీర్చివున్న సమయంలో, వారి యింటికి కొంచెం దూరంలో ఆగిన మేనాలోంచి దిగి, వారిని సమీపించి, నమస్కరించిన వ్యక్తిని ఆశీర్వదించి కూచోమన్నారు.

ఆ వచ్చిన వ్యక్తి రాజుగారి దివాన్రా అబ్బాయ్.

ఆశీర్వచనం తప్ప మరో ముక్క అవధానిగారు మాట్లాడలేదు. కొంతసేపు మౌనం రాజ్యమేలిన తర్వాత, తిరిగి తమ వ్యాఖ్యానాన్ని ప్రారంభించబోతున్నప్పుడు, 'అవధాని గారూ చిన్న మనవి' అన్నాడ్రా అబ్బాయ్ దివాన్.

'అవధానిగారు 'ఏమిట'న్నట్టు చూసారు.

"తమరిద్వారా ఉపనిషద్రహస్యాల్ని తెలుసుకోవాలని ప్రభువులు తహతహలాడుతున్నారు. తమరి సెలవెప్పుడైతే అప్పుడు పల్లకీ పంపిస్తామని మనవిచెయ్యమన్నారు. ఈ విషయం తమరికి ప్రత్యేకంగా విన్నవించుకోడానికి నన్ను పంపించారు.

'మంచిది' అన్నారాయె అవధానిగారు.

వారి సమాధానంకోసం ఎదురుచూస్తున్నాడు దివాన్. వారి నోటమ్మట మరో పలుకు లేదురా అబ్బాయ్.

కొంతసేపాగాక "ప్రభువులతో ఏమి సెలవియ్యమంటారు" అనడిగాడాయె దివాన్.


'వీలు చూసుకుని కబురు చేస్తామని చెప్పండి' అన్నారాయె ఆయన.

వారి తత్వం తెలిసున్న దివాన్, 'చిత్తం' అని సెలవు తీసుకున్నాడాయె.

అబ్బాయ్, అలా రెండు పక్షాలు గడిచిపోయాయిరా. అవధానిగారి ప్రవర్తన, శిష్యులెవరికీ అంతుబట్టలేదురా. అడిగినవాడికి లేదనకుండా విద్యాదానంచేసే గురువులు రాజుగారి విన్నపాన్ని ఎందుకు వుపేక్షించారో అగమ్య గోచరంగా వుంది.

రఘురామరాజు గారు ఆ ప్రాంతానికి మొఖాసాదారు. పండిత పోషకులు. అవధాని గారంటే అపరిమితమైన గురుభక్తి. వారి కుటుంబానికి, శిష్యవర్గానికి అవసరమయే సంభారాలు యావత్తూ రాజావారి దివాణంనుంచే సరఫరా అవుతాయి. అందువల్ల వారి అనుష్ఠాన జపతపాదులు నిర్విఘ్నంగా సాగిపోతున్నాయి. నిత్యాగ్నులు అవిచ్ఛిన్నంగా వెలుగుతున్నాయి. అవేగాక, వారు తలపెట్టిన యజ్ఞయాగాది క్రతువులన్నిటి వెనక రాజావారి అండదండ లున్నాయి.

అటువంటప్పుడు రెండుసార్లు కబురుచేసినా అవధానిగారు కదలలేదు. కారణమేమిటా అన్నది అందరికీ శేషప్రశ్నే. వచ్చిన దూతల ప్రవర్తన సవినయంగానూ, భక్తి ప్రపత్తులతోనూ వుంది తప్ప మరో విధంగా లేదు. మరి ఎందువల్ల అవధానిగారు ఉపేక్షా భావంతో వున్నారో తెలియక అందరూ గుబ్బిట్లు పడ్డారాయె. లోలోపల గింజుకు పోయారే తప్ప, వారితో



అనే ధైర్యమూ సాహసమూ కూడా ఎవరికీ లేక పోయాయి.

ఆ విధంగా అందరూ అతలాకుతలం అవుతూ వుంటే మూడో పక్షం ప్రవేశించింది.

అవధానిగారి దైనందిన కార్యక్రమంలో ఏమీ మార్పు లేదు.

పరిస్థితులావిధంగా వుండగా, యధావిధిగా తమ బోధనా కార్యక్రమంలో అవధానిగారు నిమగ్నులై వుండగా, దూరంగా గుర్రపు డెక్కల చప్పుడు వినిపించిందిరా అబ్బాయ్. అందరి చెవులూ నిక్కబొడుచుకున్నాయి.

అవధానిగారి భ్రుకుటి ముడిపడిందేమోనని కొందరికి అనుమానం కలిగింది.

ఆ గుర్రపు డెక్కల వుధృతం అవధానిగారి ఇంటి సందుని సమీపిస్తుంటే ఆగింది. ఉత్సుకతని ఆపుకోలేని శ్రోతలు ఆ ధ్వని దిక్కు తలలు తిప్పారు. సందు మొగలో జోడు గుర్రాల సార్టు మెల్లిగా ఆగింది. అందులోనించి రాజావారు, వారి వెనక దివాన్ దిగారు. సార్టు వెనక వేపునుంచి వచ్చిన ఇద్దరు నౌకర్లు, సార్టు లోంచి మొఖమల్ బట్ట కప్పబడినటువంటి వస్తువొకదాన్ని తీసి చేతబట్టుకున్నారు. అందరూ అవధానిగారి ఇంటి వైపుకి నడక సాగించారు.

అవధానిగారి పెదవులమీద చిరుమందహాసం కనిపించిందని కొందరన్నారులే తరువాత.

అవధానిగారిని సమీపించిన రాజావారు అరుగు కింద నుంచే నమస్కరించారు. సమీపించిన రాజావార్నిచూసి, అవధానిగారు తప్ప అందరూ సంభ్రమంగా లేచి నిలబడ్డారు. అవధాని గారు చేయెత్తి రాజావార్ని ఆశీర్వదించి సాదరంగా ఆహ్వానించారు.

రాజావారు కూర్చోలేదురా అబ్బాయ్. నిలబడే వుండిపోయారు.

"చాన్నాళ్ళుగా వుపనిషత్తుల గురించి తెలుసుకోవాలని వుంది. ఆ జ్ఞానభిక్షని ప్రసాదించమని మనవి" అన్నార్రా అబ్బాయ్ దోసిలొగ్గి.

"శుభం ఎల్లుండి ఏకాదశీ సోమవారం అపరాహ్ణం తరవాత బావుంది".

"మహాప్రసాదం. స్టారు సిద్ధంగా వుంటుంది." అని వెనక నిలబడ్డ నౌకర్ల చేతిలోంచి తాంబూలంతో సహా వున్న వెండి పళ్ళేన్ని అవధానిగారి పాదాలవద్ద వుంచి, వారి ఆశీర్వచనం తీసుకుని వెనక్కి మళ్ళార్రా అబ్బాయ్ రాజావారు.

అప్పుడు చూసార్రా అవధానిగారు శిష్యులకేసి. వారి పెదవుల మీద వెన్నెల పువ్వులా దరహాసం.

అవధానిగారి ప్రవర్తనలో ఆంతర్యం అప్పటికి అర్థమయిందిరా అందరికీ. 'సాహో' అని అంజలి ఘటించారురా అందరూ.

విద్యనీ, అందులోనూ అనర్ఘరత్నం లాంటి బ్రహ్మజ్ఞానాన్ని పొందగోరినప్పుడు, వినయంతో కూడిన ఆర్తి ప్రధానం కదరా అబ్బాయ్.

ఇప్పటి విద్యార్థులలో ఆ వినయమూ, గురువులలో ఆ విశ్వాసమూ కలికానికన్నా కనబడటంలేదు గదరా ఛ్ఛ!

---

# ఆంధ్రజ్యోతి
## సచిత్ర వార పత్రిక

# కార్టూన్ల పోటీ

* 20 ఉత్తమ కార్టూన్లకు 20x75-1500 రూపాయలు

* రెండు ఉత్తమ కార్టూన్ బొమ్మల కథలకు 500x2-1000 రూపాయలు

(10 లేదా 12 పేజీలకు మించని కథ)

* స్ట్రిప్ కార్టూనులు 50x50-2500 రూపాయలు

ప్రపంచ ప్రఖ్యాత కార్టూనిస్ట్ శ్రీ అబూ అబ్రహాం ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక నిర్వహిస్తున్న కార్టూన్ల పోటీకి ముఖ్య న్యాయ నిర్ణేతగా వ్యవహరించడానికి అంగీకరించారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. కార్టూన్ల పోటీ గడువు తేదీ 15.11.85 వరకు పొడిగించడమైనది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్టూనిస్టులు యితోధికంగా మంచి బొమ్మలు వేసి పోటీలో 5000 రూపాయలు గెలుచుకోగలరని ఆశిస్తున్నాము.

**నిబంధనలు:**

* కార్టూన్లసైజు: 15x10 సెం.మీ.

* బొమ్మల కథకు కార్టూన్ల సైజు: 24 1/2x28 సెం.మీ.

* స్ట్రిప్ కార్టూనుల సైజు: 28x11 1/2 సెం.మీ.

* ఒక కార్టూనిస్టు ఎన్ని బొమ్మలయినా పంపవచ్చు. ఎన్ని పోటీలలోనయినా పాల్గొనవచ్చును.

* కాపీ కార్టూనులు, అనుసరణలు పంపరాదు.

* కార్టూనులు తమ సొంతమని, అనుసరణలు కావని హామీ పత్రం జతపరచాలి.

* బహుమతికి యోగ్యం కాని, అంగీకరించని కార్టూనులు తిప్పి పంపగోరేవారు సొంత చిరునామాతో స్టాంపులు అతికించిన కవరు విధిగా జతచేయాలి.

* బహుమతి నిర్ణయం ఆంధ్రజ్యోతి సంపాదక వర్గానిదే తుది తీర్పు. ఉత్తర ప్రత్యుత్తరాలు జరపబడవు.

* బహుమతి పొందిన కార్టూన్లుగాక, వచ్చిన వాటిలో మంచివి వుంటే ఆయా కార్టూన్లను ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో వీలువెంబడి ప్రచురించగలము.

* కార్టూనిస్టులు తమ కార్టూన్లను

కార్టూన్ల పోటీ
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక
పోస్టుబాక్సు - 712
విజయవాడ - 520 010

చిరునామాకు పంపాలి.

గడువుతేదీ పొడిగింపు: 15-11-1985

—ఎడిటర్